
కథ

# కొత్తజీవితం

పి.యస్.యమ్ లక్ష్మి

నాట్య కళాకారులు కొంతకాలం తర్వాత నాట్యం చెయ్యటం ఆపేస్తే అవయవాలన్నీ సరిగా పనిచెయ్యటం మానేసి లావెక్కుతారంటారు. అలాగే క్రీడాకారులు. ఒక విధంగా చెప్పాలంటే నేను కూడా ఆ బాపతే. అయితే వాళ్లవి శారీరక సమస్యలయితే నాది మానసికం. ఎందుకంటారా? నిన్న మొన్నటిదాకా సంసారం, పిల్లలు, ఉద్యోగ బాధ్యతలు వీటితో... ఇవికాకుండా వేరే ప్రపంచం కూడా వుంటుందన్న విషయమే మర్చిపోయాను. పిల్లలు పెద్దవాళ్ళయి దూరదేశాలు వెళ్ళటం, నేను రిటైర్ కావటం అన్నీ ఒక్కసారవటంతో హడావిడి ప్రపంచాల గేట్లన్నీ మూసేసి నేనో మహాశూన్యంలో వున్నట్లనిపించింది.



అప్పటిదాకా ఉరుకులు పరుగులతో ఒక్కక్షణం తీరిక అంటే అపురూపమయిన, ఆడంబరమయిన విలాసమనుకునే నాకు ఒక్కసారిగా అంతఖాళీ సమయాన్ని ఏం చెయ్యాలో తెలియటం లేదు. జీవితంలో ఎన్నో విషయాలని చక్కని ప్రణాళిక ప్రకారం సాధించిన నాకు ఈ విశ్రాంతి జీవితాన్ని ఎలా గడపాలో ప్లాన్ చేసుకోవటం కష్టంగా వుంది. అందుకే మా ఆయన్ని సలహా అడిగాను.

''నీ ఇష్టం. నువ్వెలా చేద్దామంటే అలాగే చేద్దాం'' అన్నారు.

చిన్నచిన్న విషయాలకి ఆలోచించి ఆయన బుర్రకి శ్రమ కలిగించటం గానీ, నాతో గోలలు తెచ్చుకోవటం గానీ ఆయనకస్సలు ఇష్టం వుండదు.

సరే ఓ నాలుగు రోజులు ఎటన్నా తిరిగి వద్దామన్నాను. మా బంగారం కాదనరుగా. పైగా ఏ కళను

న్నారో ఆలోచన కూడా చెప్పారు. శ్రీశైలం వెళ్ళి వద్దాం. కార్లో వెడదాం. హడావిడి లేకుండా అన్నీ చూసుకుంటూ వెళ్ళచ్చు అన్నారు.

ఇంతకాలం దేముణ్ణి కూడా పెద్దగా గుర్తుపెట్టుకోలేదు మేము. ఇంత ఖాళీ సమయం వుంది కదా. కొంత ఆయనకి కేటాయిస్తే పోలా అనుకుని ఎప్పుడో కొన్న స్తోత్ర రత్నావళి పుస్తకాన్ని తీసి ఒక బేగ్‌లో సర్దాను.

''అవ్వన్నీ ఎందుకు?'' అడిగారాయన. పెళ్ళికి పోతూ... అన్నట్లనిపించింది సుమండీ నాకు.

''గుళ్ళో కూర్చుని కాసేపీ స్తోత్రాలు చదువుకుంటానండీ.... కాస్త మనశ్శాంతి'' నా సమాధానం.

''మనశ్శాంతి మన మనసుల్లో వుంటుంది. మనలోనూ, మన ఆలోచనల్లోనూ వుంటుంది. ఎక్కడో కూర్చుని ఏదో చేస్తే రాదు.'' ఈ మనశ్శాంతి విషయంలో మాత్రం మా ఆయనకూ నాకు ఎప్పుడూ పడదు.

పిల్లలు దూరంగా వున్నారు. వండుకున్నారో లేదో... తిన్నారో లేదో అని నేనాలోచిస్తుంటే ''నువ్వన్నీ అనవసరంగా ఆలోచిస్తావు. ఆకలేస్తే తినాలని తెలియనంత వెర్రివాళ్ళు కాదులే మన పిల్లలు'' అంటారు.

అప్పుడే నాకూ కోపం వస్తుంది. అసలు ఆయన మనిషేనా? మనిషయితే మనసనేది వున్నదా? అని ఓ పెద్ద అనుమానం.



''నేను మనిషినే. నాకు మనసున్నది. అందుకేగా వాళ్ళ భవిష్యత్‌కోసం వాళ్ళు విదేశాలకు వెళ్తామంటే ఆ మనసుతో ఆలోచించే మనిషిగా సరేనన్నాను. ఇక్కడేముంది కుతంత్రాలు, కక్షలుకార్పణ్యాలూ తప్పితే. ఎదుటి వాళ్ళ గురించి ఆలోచించే వాళ్ళెవరయినా వున్నారా?'' ఆ విషయంలో ఇంకో మాటలేదన్నట్లు మాట్లాడ తారెప్పుడూ ఆయన.

''మన దేశం, మన మనుషులు, తల్లిదండ్రులూ అందర్నీ వదిలిపోతే వాళ్ళెట్లా వున్నారో వాళ్ళ బతుకులేమో గానీ ఇదిగో మన బతుకులిలాగే వుంటాయి. అన్నీ వుండి ఏం లాభం? ఓ సరదానా సందడా. పెద్ద శూన్యం తప్పితే'' నా అక్కసు వెళ్ళబోశాను.

''మైడియర్ శ్రీమతి, నువ్వు వున్న ఊరు అమ్మా నాన్నా అని మీ వూళ్లో కూర్చోకుండా ఈ వూరెందుకొచ్చావోయ్'' పాయింట్ లాగారు.

''ఇక్కడ ఉద్యోగం వచ్చింది కనక ఇక్కడికొచ్చాను. ఇక్కడ కాకపోతే ....'' నా మాట సగంలోనే ఆపేశారు.

''ఆ... ఆ... నాకు తెలుసు. ఇక్కడ కాకపోతే ఉద్యోగం ఎక్కడవస్తే అక్కడికెళ్ళే దాన్నంటావు. అవునూ. వెనకటి తరానికి చెందిన ఆడపిల్లవి. నువ్వే ఉద్యోగం కోసం ఇంతదూరం వస్తే మరి ఈ తరం వాళ్ళు నీ పిల్లలు... వాళ్ళేం తక్కువతిన్నారా? సర్లే... అన్నీ సర్దేశావా... పెందరాళే బయల్దేరుదాం'' పిల్లల మీద నుంచి ఆలోచనలు మార్చటానికి నన్ను హడావిడి పెట్టారు.

నిజమే ఆ మాట. అప్పుడు నేను ఉద్యోగమని ఇంతదూరం వచ్చినప్పుడు అమ్మ చాలా బాధపడ్డది. ఇప్పుడంటే మనిషికో ఫోన్ వుంటోంది గానీ అప్పుడే పేటకో ఫోన్ కూడా వుండేది కాదు. అందుకే అమ్మ రోజుకో ఉత్తరం రాసేది. నన్ను రాయమంటే నేను విసుక్కునే దాన్ని రోజూ రాయటానికి విశేషాలేముంటాయని. ఇప్పుడు మా పిల్లలు అంతే. రోజుకోసారి ఫోన్ చెయ్యం డంటే రోజూ విశేషాలేముంటాయంటారు. వాళ్ళదాకా వస్తేగానీ తెలియదు వాళ్ళకీ బాధ. అయినా వాళ్ళక్కూడా ఈ అవస్థలెందుకు. హాయిగా అంతా కలిసి ఒక చోటే వుంటారు. ఆలోచనల్లో కూడా పిల్లలకి కష్టం వూహించలేదు తల్లి మనసు.

సరే... ఓ నాలుగు రోజులు తిరిగొస్తే కొంచెం కాలక్షేపమవుతుందని బయల్దేరాం. హైద్రాబాద్ సిటీ ట్రాఫిక్‌లో ఆయన డ్రైవ్ చేస్తుంటే ఎప్పటిలాగే గుండె లరచేతిలో పెట్టుకుని కూర్చున్నా. కారులో మా వారి పక్కన కూర్చుని వెళ్తున్న సరదాగానీ, కొత్త ప్రదేశాలకెళ్తున్న సంతోషం కానీ మచ్చుకి కూడా లేదు.

ఎడమవైపు నుంచీ, కుడివైపు నుంచీ ఇష్టం వచ్చినట్లు బెర్ట్ కింద పడిపోతుందేమో ననిపించేటట్లు

సర్కస్ ఫీట్‌లాగా రయ్యిమని ఓవర్ టేక్ చేసి వెంటనే కారు ముందు నుంచే అడ్డం తిరిగి ఇంకో వెహికల్‌ని ఓవర్ టేక్ చెయ్యటానికి ప్రయత్నించే బైకు బాబులకు డ్రైవింగ్ ఎవరు నేర్పుతున్నారో, లైసెన్సు ఎలా ఇస్తున్నారో నాకస్సలు అర్థం కాదు. ఆటో వాళ్ళు సరేసరి. రోడ్లన్నీ వాళ్ళవే.

అసలు ఈ లైసెన్సులిచ్చే వాళ్ళకి డ్రైవింగ్ వచ్చా? రూల్సన్నీ తెలుసా? అని నాకో పెద్ద డౌట్. నన్నడిగితే ఎవరెవరికి లైసెన్సు ఇవ్వచ్చో ఎవరికి ఇవ్వకూడదోనని వాళ్ళకి వారానికో రోజయినా ట్రైనింగ్ ఇస్తూ వుండాలి.

ఎలాగో సిటీ దాటాం. కొంచెం స్థిమితంగా కూర్చుని కొత్తప్రదేశాలన్నీ కుతూహలంగా చూడ సాగాను. కొంచెం హుషారు కూడా వచ్చింది. ఇన్నాళ్టికి ఇలా తీరిగ్గా మా కోసం మేము కొంత సమయం, అదీ ఏ బాదర బందీ లేకుండా గడప గలుగుతున్నామని సంతోషం.

నా సంతోషం ఎంతోసేపు నిలవలేదు. దోవలో వస్తున్న వైన్‌షాపులని చూస్తే మతి పోయింది. ఇన్ని షాపులున్నాయంటే... వాళ్ళకి వ్యాపారం జరిగితేనే కదా అన్ని వుండేది. అంటే దోవన వెళ్ళే వాళ్ళల్లో కొందరయినా అవి తాగి డ్రైవ్ చేస్తున్నారన్న మాట. అందుకే యాక్సిడెంట్లు. నాకప్పుడే జ్ఞానోదయం అయింది. మా కాలనీలో బట్టల షాపులు, కిరాణా షాపులూ పెట్టినవన్నీ వ్యాపారం లేదని చాలామటుకు తీసేశారు. వైన్‌షాపులు మాత్రం ఒకటికి మూడున్నాయి. మా కాలనీలో కూడా అంతమంది తాగే వాళ్ళున్నారా!!

కనిపించే షాపులే ఇన్నివుంటే ఇంక బెల్టు షాపులని, నాటు సారాలని డబ్బు పెట్టలేని వాళ్ళ అందుబాటులో ఎన్ని షాపులున్నాయో. అందుకే పేపరు తెరిస్తే ఇవేవార్తలు. ఎప్పుడివే వార్తలని మనం కొట్టి పడేస్తాం గానీ వీటి మూలంగా ఎన్ని కుటుంబాలు ఎన్ని కష్టాలు పడుతున్నాయో. నాకింకో డౌటు. ఈ బిజినెస్ చేసే వాళ్ళు తాగుతారా?

పెసర చెట్లు కోసి రోడ్డు మీద పరిచారు చాలా చోట్ల. వాటి మీద నుంచే అన్ని వెహికల్స్ వెళ్తున్నాయి. అవన్నీ పాడయి పోవా అని అడిగాను ఆయన్ని చిన్నపిల్లలా. ఇవి నేనెప్పుడు చూడలేదు. మరి. మన చుట్టు పక్కలే మనకి తెలియని విషయాలెన్ని వున్నాయో.

''బళ్ళు వెళ్తున్నప్పుడు ఆకాయలు పగిలి గింజలు విడిగా వస్తాయి. తర్వాత గడ్డి వేరు చేసి ఆ గింజల్ని తీసుకుంటారు.''

తెలియని విషయాలు తెలుసుకుంటుంటే మనసు ఆహ్లాదంతో నిండి పోయింది. బహుశా అంతకు ముందు అలాలేసిన చోట మిగిలిపోయిన గింజలను కుంటా రకరకాల పిట్టలు ఏరుకు తింటున్నాయి. కొన్ని పిట్టలు కారు శబ్దం విని తుర్రున ఎగిరి పోతూంటే కొన్ని పిట్టలు నింపాదిగా అడుగు తీసి అడుగువేస్తూ కదులుతున్నాయి. భుక్తాయాసంతో కదలలేకుండా వున్నా నువ్వే తప్పుకుపో అంటున్నట్లు.


సాయం కాలానికి శ్రీశైలం చేరాం. స్నానాలు, దైవదర్శనం, విశ్రాంతి ఆ రోజు నా పుస్తకం బయటికి తియ్యలేదు.

మర్నాడు ఆయన్ని ముందే అడిగాను. ''నేను గుళ్ళో కూర్చుని కాసేపు అవ్వన్నీ చదువుకోవాలి. మీరు చదువుతారా?''

''నావల్ల కాదుగానీ, క్రికెట్ ఉంది. దర్శనమయ్యాక నేను రూమ్‌కొచ్చి క్రికెట్ చూస్తాను. నువ్వు ఏ డిస్టర్బెన్స్ లేకుండా హాయిగా నీ యిష్టం వచ్చినంత సేపు చదువుకునిరా'' అన్నారు. అదీ బాగానే వుందనిపించింది.

దైవదర్శనం అయ్యాక భ్రమరాంబ అమ్మవారి గుడి ముందువున్న గట్టు మీద కూర్చుని పుస్తకం తీశాను. కొన్ని ఏళ్ళకి ఆ పుస్తకాలు తీసి చదువుదామనుకున్నా కదా. ఎందుకైనా మంచిదని విఘ్నేశ్వరుని ప్రార్థనతో మొదలు పెడదామని తీశాను.

పక్కనే ఓ దంపతులు వచ్చి కూర్చున్నారు. ఆయన కొబ్బరి చిప్పకు వున్న పీచు పట్టుకుని చిప్పని నేలకేసి కొడుతున్నాడు. ఆ అదురుకే చెయ్యి నొప్పెట్టినట్టు వుంది. కొట్టినవెంటనే చిప్పని వదిలేస్తున్నాడు. అది నా దగ్గరకొచ్చి పడుతోంది. 'అసలే నాది కొత్త పట్టుచీర'. కొబ్బరి మరకలు పడితే తొందరగా వదలవు. నాకెందుకులే అని వూరుకోకుండా చిప్ప పట్టుకుని ఇలా కొట్టండని చూపించా. ''లేదు ఇట్లా వస్తుంది'' అని చెప్పి ఆయన తన ప్రయత్నం కొనసాగించాడు.




''విఘ్నేశ్వరా, నీ ప్రార్థనతోనే కదయ్యా మొదలెట్టాను. మొదట్లోనే విఘ్నమా'' అనుకుంటూ అక్కడినుంచి లేచి బాగా ఎత్తుగా వున్న అరుగుమీదకి వెళ్ళి కూర్చున్నాను. గోడమీద ''ఋగ్వేదము'' అని రాసి వుంది. బహుశ అక్కడ ఋగ్వేద పారాయణ చేస్తారేమో. బలే మంచి స్థలంలో కూర్చున్నాను. పుణ్యమంతా నాదే అని మళ్ళీ విఘ్నేశ్వర ప్రార్థన మొదలు పెట్టాను.

''ఏయ్, ఈడ కూసుందాం రండి'' ఇంకో కుటుంబం పిల్లలతో సహా వచ్చి కూర్చున్నారు.

''అమ్మా తమ్ముడు సూడవే.. నా లడ్డూ కూడా లాక్కుని తింటున్నాడు'' అందులో ఎనిమిదేళ్ళ కూతురు ఫిర్యాదు.

''పోనీలే.. తమ్ముడు మగపిల్లాడు కదా. తిననియ్యి. అన్నిటికీ గోల పెట్టమాకు'' తల్లి కూతుర్ని కసరటంతో ఒక నిముషం తమ్ముడు తింటున్న లడ్డూకేసి ఆశగా చూసి ఇది మామూలే అనుకుందేమో దృష్టి మరల్చి జనాన్ని చూడసాగింది.

నాకాశ్చర్యం వేసింది. ఈ రోజుల్లో కూడా ఆడా మగా మధ్య ఇంత తేడా వుందా. మగపిల్లాడని ఆ అబ్బాయికే పెట్టేస్తే ఆ అమ్మాయి ఆకలెలా తీరుతుంది? అర్జంటుగా ఆ తల్లికో క్లాసు పీకుదామనుకున్నాను. కానీ నా చిరకాల వాంఛ నాలుగు లైన్లన్నా నడవలేదు. అందుకే మళ్ళీ వినాయక ప్రార్థన మొదలెట్టాను.

కళ్ళు అక్షరాల వెంట పరిగెత్తుతున్నా మనసెప్పుడో గతంలోకి పారిపోయింది. మేమెంత అదృష్టవంతులం. మా ఇళ్ళల్లో ఎప్పుడూ ఈ ఆడా మగ తేడా చూపించలేదు. మేము కూడా ఎప్పుడూ మా పిల్లల్లో ఈ తేడాలు చూపించలేదు.అందుకే వాళ్ళకసలు అలాంటివి వుంటాయని కూడా తెలియదు. బహుశా వాళ్ళు వాళ్ళ పిల్లల్లో కూడా అలాంటి తేడాలు చూపించరు. చదువు సంస్కారం మూలంగా వచ్చిన మార్పు ఇది. అసలు కాస్తో కూస్తో చదువుకుని ఆర్థికంగా కూడా కొంత స్థోమతు కలిగిన వాళ్ళు ఇలాంటి తేడాల జోలికి పోరేమో.

ఆర్థిక స్థోమతులేని వాళ్ళే కుటుంబ సభ్యులందరికీ అన్నీ సమకూర్చలేక ఇలాంటి తేడాలు చూపిస్తారు. ప్రజలందరికీ విద్య, ఉద్యోగం వుండేటట్లు ఏ ప్రభుత్వమూ ప్రయత్నించదెందుకు? ఎంతసేపూ పదవిలో వున్న వాళ్ళని తిట్టి పొయ్యటమూ, వాళ్ళని గద్దె దింపటానికి ప్రయత్నించ టమూ తప్పితే, ప్రజలందరూ ఏ లోటూ లేకుండా సుఖంగా వుంటే.. ఎటో వెళ్ళిపోతున్న మనసును పట్టి లాక్కొచ్చి పుస్తకమప్ప చెప్పాను.

''అయితే వదినా, చందూ కార్తీక్ కలిశారా? తర్వాత ఏమయింది? అయినా యశోధర లాంటి ఆడ రాక్షసులు ఎక్కడన్నా వుంటారా? మరీ విడ్డూరం కాకపోతేనూ'' ఇంకో పక్కనున్న గ్రూప్

లోంచి ఓ అమ్మలక్క నిట్టూర్చింది.

''టీవీల్లోనూ సినిమాల్లోనూ ఆడవాళ్లనిలా వికృతంగా చూపించి వాళ్ల పరువు తీస్తున్నారు. లేని బుద్ధులు నేర్పించటం కదూ. వీటన్నింటినీ బేన్ చేసి పడెయ్యాలి ముందు'' ఓ వనితామణి వాపోయింది. ఈవిడ తప్పకుండా ఏ మహిళా మండలి సభ్యురాలో అయి వుంటుందనుకున్నాను.

''వాళ్లు మాత్రం ఏం చేస్తారు. వున్న వాటినే కాస్త అటూ ఇటూ చేసి చూపిస్తారు. మా అత్త ముందు ఎంతమంది యశోధరలైనా దిగదుడుపే. అమ్మో.. వస్తోందదిగో..'' బహుశా స్వాతంత్ర్యం లేని ఓ మహిళ. ఎన్నివేల మహిళా దినోత్సవాలు జరుపుకుంటే ఇలాంటి వాళ్లకి స్వాతంత్ర్యం వస్తుందో. అన్నట్టు.. అసలు వీళ్లకి మహిళా దినోత్సవం గురించి తెలుసా?

ఇంక ఇంత జనంలో కూర్చుని ఈ స్తోత్రాలు చదవటం నావల్ల కాదని నిశ్చయించుకుని పుస్తకం మూసేశాను. హమ్మయ్య. కొంచెంసేపు చుట్టూ జనాన్ని చూసి రూమ్‌కొచ్చాను. నేను తలుపు కొట్టింది కూడా విననంత శ్రద్ధగా క్రికెట్ చూస్తున్నారాయన.

కొంచెంసేపు తలుపుబాదిన తర్వాత తీశారు. పైగా ''నువ్వేదో చాలా పెద్ద పుస్తకం తీసుకు వెళ్లావుగా. అప్పుడే వస్తావనుకోలేదు'' అన్నారు.

''తలుపుకొట్టింది కూడా వినపడనంత మునిగిపోయారా ఆ క్రికెట్‌లో. నాకేమో అక్కడ వచ్చి పోయే వాళ్ల మాటలతో అసలు కాన్‌సెన్‌ట్రేషన్ కుదరలేదు. అయినా గుళ్లో అన్ని విషయాల గురించి అంత పెద్దగా ఎలా మాట్లాడుతారో'' చికాకు బయట పెట్టకుండా వుండలేక పోయాను.

''చూడమ్మాయ్.. గుడన్న తర్వాత నీలాంటి సాధుపుంగవులూ సన్యాసులే కాదు - మామూలు మనుష్యులు కూడా వస్తారు. వాళ్లకి వాళ్ల రొటీన్ లైఫ్ నుంచి అదొక రిలీఫ్. నీలాంటి వాళ్ళని డిస్టర్బ్ చేస్తున్నామనే ఆలోచనే వాళ్లకుండదు. పోనీ నన్నొచ్చి కాసేపు ఎవరూ మాట్లాడకుండా కాపలా కాయమంటావా?'' ఎంత సీరియస్‌గా అడిగినా ఆయన సెటైర్ నాకు తెలియదా.

''ఏమక్కర్లా.. మీరా టీవీ కట్టెయ్యండి. నేనిక్కడ ప్రశాంతంగా కూర్చుని చదువుకుంటా''

బుద్ధిగా టీవీ కట్టేశారు. పుస్తకం తీసి మళ్లీ మొదలు పెట్టాను.

''శుక్లాంబరధరం విష్ణుం..''

పాపం నా మూలంగా ఆయన క్రికెట్ చూడకుండా కూర్చున్నారు. నా పుస్తకం తర్వాతయినా చదువుకోవచ్చు. ఈ మేచ్ మళ్లీ రేపు రాదుగా.

''పోన్లే మీరు క్రికెట్ చూడండి. నేను తర్వాత చదువుకుంటాను'' కొంచెం ఉదారత ప్రదర్శించాను.

''అమ్మా, త్యాగశీలీ, నీక్కావాల్సింది నువ్వు చేస్తున్న పని మీద కాన్‌సెన్‌ట్రేషన్. అదే నువ్వాఫీసు పని చేసేటప్పుడు పక్కన ఎంత గందరగోళంగా వున్నా చలిస్తావా? లేదు. ఎందుకు? అక్కడ నీకలా అలవాటయింది. ఈ జీవితం నీకు కొత్త. అందుకే అంతగా కుదరటం లేదు. కొత్త పద్ధతులకి అలవాటు పడటానికి ఎవరికయినా కొంత సమయం పడుతుంది. ఏకాగ్రత కుదరటం కూడా కష్టమవుతుంది. కొంచెం ధృఢ నిశ్చయంతో కాన్‌సెన్‌ట్రేట్ చెయ్యి. నెమ్మది నెమ్మదిగా అలవాటు పడతావు. అప్పుడు ఎంతమందిలో వున్నా నీకేమీ ఇబ్బంది వుండదు''

అయన లెక్చరిచ్చే అవకాశాన్ని వదులుకోలేదనుకున్నా చెప్పింది సరిగ్గానే చెప్పారనిపించింది. కృషితో మనసు నిలకడగా వుంచితే ఏదయినా సాధించవచ్చనిపించింది.

''సరే మీరు టీవీ పెట్టుకోండి. నేను చదువుకుంటా''...మంచి విషయాలు ప్రారంభించటానికి ఆలస్యం ఎందుకు? నా కొత్త జీవితానికి వీలయినంత తొందరగా అలవాటు పడాలని నిర్ణయించుకున్నా.

*


చిరునామా

శ్రీమతి పి.ఎస్.ఎమ్. లక్ష్మి

బి.391, శ్రీకృష్ణానగర్, యూసఫ్‌గూడ చెక్‌పోస్టు,

హైదరాబాదు-500045. ఫోన్: 986600129